క్లుప్తంగా

మినీలారీ బోల్తా



ఫిరంగిపురం: ప్రమాదవశాత్తు అదుపుతప్పి మినీలారీ పొలాల్లోకి బోల్తా పడిన ఘటన మండలంలోని రేపూడి గ్రామశివారులో బుధవారం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. గుంటూరు నుంచి నరసరావుపేట వెళ్తున్న మినీలారీ వర్షం పడటంతో అదుపుతప్పి పొలాల్లోకి వెళ్లి బోల్తాపడింది. డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు స్పందించి 108కు ఫోన్ చేయడంతో నరసరావుపేటకు చికిత్స కోసం తరలించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

మజ్జిగ పంపిణీ

మంగళగిరి: యర్రబాలెం శివాలయం సెంటర్‌లో స్థానిక యువత ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వేసవి చలివేంద్రంలో బుధవారం దాతల సహకారంతో మజ్జిగ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. యర్రబాలెంకు చెందిన దివంగత ప్రధానోపాధ్యాయులు నాయుడు వీర రాఘవేంద్రరావు జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు, దివంగత గుర్రాల ధనలక్ష్మి జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు బాటసారులు, వాహనదారులకు మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో వల్లంశెట్టి నాగేశ్వరరావు, గుండాల సాయి, లేళ్ల నరసింహారావు, మక్కే కిరణ్, గద్దం మోహనకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మంచినీటి బోరుకు మరమ్మతులు

ఫిరంగిపురం: మునగపాడు గ్రామంలోని మంచినీటి బోరు పాడైపోయింది. ఇటీవల గ్రామంలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్‌కుమార్ దృష్టికి ఈ సమస్యను గ్రామస్తులు,పార్టీ నాయకుడు ఎం.రామిరెడ్డి తీసుకెళ్లారు. దీంతో స్పందించిన సురేష్‌కుమార్ సొంతనిధులతో మరమ్మతులు చేయించాలని చెప్పడంతో బుధవారం కూలీలతో పనులు చేయించి బోరును ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చారు.

అనుమానాస్పద స్థితిలో కార్పెంటర్ మృతి

మంగళగిరి: నగరంలోని టిప్పర్ల బజారుకు చెందిన ఓ కార్పెంటర్ అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ఘటన బుధవారం జరిగింది. పట్టణ పోలీసుల కథనం మేరకు నగరంలోని టిప్పర్ల బజారుకు చెందిన షేక్ గాలిబ్ కుమారుడు షేక్ మహబూబ్ జిలానీ అలియాస్ బుజ్జి (44) బుధవారం అదే ప్రాంతంలోని ఓ వీధిలో అనుమానాస్పద స్థితిలో మృతి చెంది ఉండడాన్ని స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న పట్టణ ఎస్‌ఐ మహేంద్ర తన సిబ్బందితో హుటాహుటిన ఘటనా ప్రాంతానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి స్థానికులను వివరాలు అడిగి తెలుసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నైతిక విలువలు పెంచుకోవాలి



ఫిరంగిపురం: విద్యార్థులు నైతిక విలువలు పెంచుకోవాలని సిస్టర్ నిర్మలామేరి అన్నారు. సెయింట్‌ఆన్స్ ఇంగ్లిషు మీడియం పాఠశాలలో బుధవారం విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. కరస్పాండెంట్ సిస్టర్ నిర్మలామేరి మాట్లాడుతూ విద్యార్థుల్లో నైపుణ్యం పెంపునకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. విద్యార్థుల ప్రగతి గురించి తల్లిదండ్రులకు చెప్పారు. అనంతరం తరగతుల వారీగా ప్రొవిజన్ సర్టిఫికెట్లు అందజేశారు.

వృద్ధులకు అన్నదానం

తెనాలి టౌన్: నాజరుపేటలోని మన ఇల్లు వృద్ధాశ్రమం, గాంధీనగర్‌లోని షిర్డీ సాయి వృద్ధాశ్రమంలో బుధవారం శ్రీ వెంకటేశ్వర యోగా సేవా కేంద్రం సభ్యురాలు ఎం. సామాజ్యం సహకారంతో వృద్ధులకు అన్నదానం చేశారు. సాలిగ్రామ మఠం ట్రస్ట్ వ్యవస్థాపకులు బాలస్వామీజీ పండ్లు పంపిణీ చేశారు. గంగానది పుష్కరాలు ముగింపు సందర్భంగా ఆయన వాటి విశిష్టత తెలియజేశారు. కార్యక్రమంలో ఎస్వీ యోగా కన్వీనర్ ఎం.రమణయ్య, సామ్రాజ్యం, అనూష, దీక్షిత, తేజ, ఆశ్రమాల నిర్వాహకులు మురళి, భారతి, సత్యనారాయణ, సుజాత, యోగా సాధకులు పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యానికి సత్కారం

తెనాలి: విశ్వవిఖ్యాత నటసార్వభౌమ ఎన్టీరామారావు శతజయంతి ఉత్సవాల్లో భాగంగా బుధవారం స్థానిక పెమ్మసాని థియేటరులో ఎన్టీఆర్ నటించిన 'ఛాలెంజ్ రాముడు' సినిమాను ఉచితంగా ప్రదర్శించారు. రోజుకొక కళాకారుడికి సత్కారంలో భాగంగా ప్రముఖ కళాకారుడు, గాయకుడు నల్లూరి శ్రీనివాసను థియేటర్ కమిటీ ఆధ్వర్యంలో సన్మానించారు. కార్యక్రమంలో కె.వి. సుబ్రహ్మణ్యం, కాళహస్తి రఘు, తుల్లిమిల్లి మరియదాసు, పరుచూరి సుబ్బారావు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు మరింత వేగవంతం

– ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే)



నగరంలోని ఆరో ఏపీఎస్పీ బెటాలియన్ రోడ్డు విస్తరణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే)

మంగళగిరి: నగర పరిధిలో కోట్లాది రూపాయలతో చేపట్టిన అభివృద్ధి పనులను మరింత వేగవంతం చేయాలని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) నగరపాలక సంస్థ అధికారులకు, కాంట్రాక్టర్లకు సూచించారు. బుధవారం ఆయన నగరంలోని తెనాలి రోడ్డు రక్షిత మంచినీటి పథకం ఆవరణలో తుది దశకు చేరుకున్న స్కేటింగ్ రింక్, ఇండోర్ స్విమ్మింగ్ పూల్ నిర్మాణాలను పరిశీలించారు. వీలైనంత త్వరగా నిర్మాణ పనులను పూర్తి చేసి నగర ప్రజలకు, యువతకు ఇండోర్ స్విమ్మింగ్ పూల్, స్కేటింగ్ రింక్‌లను అందుబాటులోకి తీసుకు రావాలని సూచించారు. అనంతరం నగరంలోని ఆరో ఏపీఎస్పీ బెటాలియన్ వద్ద సుమారు రూ.1.50 కోట్లతో చేపట్టిన రహదారి విస్తరణ, సీసీ డ్రెయినేజీ నిర్మాణ పనులను పరిశీలించారు. నిర్మాణాల్లో నాణ్యతా ప్రమాణాలను పాటించాలని నగరపాలక సంస్థ అధికారులకు, కాంట్రాక్టర్‌కు సూచించారు.

విమర్శలు చేసే వారు ఆత్మవిమర్శ చేసుకోవాలి

నగరంలోని ఆరవ ఏపీఎస్పీ బెటాలియన్ రోడ్డు విస్తరణ పనులను పరిశీలిస్తున్న సందర్భంలో స్థానిక రిటైర్డు ఉద్యోగులు పలువురు ఎమ్మెల్యే ఆర్కేను మర్యాదపూర్వకంగా కలుసుకుని నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాల తీరుతెన్నులపై హర్షం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే ఆర్కేకు కృతజ్ఞతలు తెలిపారు. ఊహించని రీతిలో మంగళగిరి నియోజవర్గంలో అభివృద్ధి చేస్తున్నారని, మీరే కనుక 20 సంవత్సరాల క్రితమే మంగళగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే అయి ఉంటే రూపురేఖలు ఎప్పుడో మారిపోయేవని కొనియాడారు. ఇంతటి విశాలమైన రహదారులను తాము చూస్తామని కలలో కూడా అనుకోలేదని, ప్రతి అభివృద్ధి పని ప్రారంభం నుంచి పూర్తి అయ్యే వరకు నిరంతరం పర్యవేక్షిస్తున్న ఎమ్మెల్యేగా తమరినే మొదటిసారి చూస్తున్నామన్నారు. నియోజకవర్గంలో మునుపెన్నడూ లేని విధంగా ఎన్నో అభివృద్ధి పనులు చేపట్టిన మీపై విమర్శలు చేస్తున్న వారు కచ్చితంగా ఆత్మ విమర్శ చేసుకోవాలని, ఇంకా నియోజకవర్గంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేసేందుకు భగవంతుడు తోడుంటాడని రిటైర్డు ఉద్యోగులు పలువురు ఆర్కేతో పేర్కొనడం విశేషం.

అర్హతే ప్రామాణికంగా సంక్షేమం

- వైఎస్సార్ సీపీ తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్‌కుమార్
- నిడుముక్కలలో ఉత్సాహంగా గడప గడపకు మన ప్రభుత్వం



నిడుముక్కలలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్న కత్తెర సురేష్ కుమార్

నిడుముక్కల(తాడికొండ): రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అర్హతే ప్రామాణికంగా ప్రతి పేదవాడికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని వైఎస్సార్ సీపీ తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్ చెప్పారు. బుధవారం తాడికొండ మండలం నిడుముక్కల గ్రామంలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో సురేష్‌కుమార్ పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకొని నాలుగేళ్లలో జరిగిన లబ్ధిని వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పేదరికం లేని సమాజ నిర్మాణమే లక్ష్యంగా జగనన్న పాలన కొనసాగుతోందన్నారు. పేదలకు 35 లక్షల ఇళ్ల స్థలాలు, ఆ స్థలాల్లో పక్కా ఇళ్లు నిర్మాణం చేస్తున్నారని పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ లబ్ధి అంటే కేవలం పచ్చ చొక్కాలు తొడుక్కున్న నాయకులకే జన్మభూమి కమిటీల ద్వారా అందేవని గుర్తుచేశారు. ప్రస్తుతం అందరికీ సంక్షేమ పథకాలు అందుతుండడంతో ప్రజలు జగనన్న పాలనకు బ్రహ్మరథం పడుతున్నారన్నారు. రాష్ట్రంలో ప్రతిపక్షాలు నిర్మాణాత్మక పాత్రను పోషించడం మరిచి కేవలం చంద్రబాబు అవినీతిని కాపాడేందుకు పాకులాడుతుండటం సిగ్గుచేటన్నారు. అమరావతి రాజధానిలో బాబు చేసిన అవినీతిపై తీగ లాగేందుకు ప్రభుత్వం సిట్ విచారణ వేసి సీబీఐకి అప్పగించేందుకు ముందుకెళితే స్టేలు తెచ్చుకొని తప్పించుకోవాలని చూసిన బాబుకు సుప్రీంకోర్టు దిమ్మతిరిగే షాక్ ఇచ్చిందని పేర్కొన్నారు. పూర్తిస్థాయి విచారణ జరిపితే బాబుతో పాటు రాజధానిలో ఆయన అనుయాయులు చేసిన దందాలు బయటకొచ్చి అరెస్టు కావడం ఖాయమన్నారు. అమరావతి అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, అమరావతితో పాటు అన్ని ప్రాంతాల సమానాభివృద్ధే ధ్యేయంగా ముందుకెళుతున్న ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టేందుకు తప్పుడు కేసులు వేసిన బాబు బండారం త్వరలో బయటపడనుందన్నారు. జగనన్న పాలనలో ఒక్క రూపాయి అవినీతి జరగకుండా సంక్షేమ నగదు ప్రతి పేదవాడి ఖాతాలకు చేరిందనేందుకు గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో వస్తున్న ఆదరణే తార్కాణమన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ మాదాసు రత్నకుమారి, ఎంపీటీసీ బోడపాటి సుశీల, మాజీ ఎంపీపీ బండ్ల పున్నారావు, రాష్ట్ర కార్యదర్శి బొర్రా వెంకటేశ్వరరెడ్డి, కంతేరు సర్పంచ్ బెజ్జం మహేష్ బాబు, ఎంపీటీసీ వలపర్ల కల్పన, మాజీ ఉప సర్పంచ్‌లు మాదాసు ఏసురత్నం, గుంటి రఘువరన్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు బోడపాటి ధర్మరాజు, జిల్లా ప్రచార కమిటీ సంయుక్త కార్యదర్శి బాకి వెంకటస్వామి, గ్రామ పార్టీ అధ్యక్షుడు అత్తోట అక్కయ్య, మాజీ సొసైటీ చైర్మన్ కోటా శ్రీనివాసరావు, ముఖ్య నాయకులు తాళ్ళ శివనాగరాజు, గునుగునూరి సాంబిరెడ్డి, పసుపులేటి వెంకట్రావు, తోకల నరసింహారావు, వెంకటయ్య మాస్టార్ పలువురు నాయకులు పాల్గొన్నారు.

బోరు పంపులకు మరమ్మతులు



బోరుపంపునకు మరమ్మతులు చేస్తున్న ఎంటీఎంసీ ఇంజినీరింగ్ సిబ్బంది

తాడేపల్లిరూరల్ : ఎంటీఎంసీ పరిధిలోని తాడేపల్లి ప్రాంతంలో డోలాస్‌నగర్‌లో కొండ ప్రాంతంలో బోరుపంపు మరమ్మతులకు గురికావడంతో ఎంటీఎంసీ ఇంజినీరింగ్ సిబ్బంది బుధవారం మరమ్మతులు చేపట్టారు. గత వారం రోజుల నుంచి బోరు పంపు పాడైపోయి నీళ్లు రాకపోవడంతో సచివాలయ ఇంజినీరింగ్ సిబ్బందికి స్థానికులు ఫిర్యాదు చేశారని, వెంటనే బోరు పంపునకు మరమ్మతులు నిర్వహించి తాగునీటిని అందించినట్లు సచివాలయ సిబ్బంది తెలిపారు.

వేణుగోపాలుడికి వైభవంగా పొన్నమాను సేవ



తాడికొండ: తాడికొండలోని వేణుగోపాల స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా బుధవారం స్వామి వారికి పొన్నమాను సేవ వైభవంగా నిర్వహించారు. స్వామి వారిని పొన్నచెట్టుతో అలంకరించి దివ్యరథంపై గ్రామోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథిగా వైఎస్సార్ సీపీ తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్ పాల్గొని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ ఉయ్యూరు వెంకటరెడ్డి, నాయకులు ఆళ్ళ శ్రీనివాసరెడ్డి, సంజీవరెడ్డి పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గిన్నిస్ బుక్‌లో నాగశ్రీకి స్థానం



తెనాలి టౌన్: తెనాలి మండలం కొలకలూరు గ్రామానికి చెందిన మల్లిశెట్టి నాగశ్రీవేదప్రణవి గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో స్థానం సంపాదించారు. అమెరికాలోని టెక్సాస్‌లో గత నెలలో నిర్వహించిన భగవద్గీత మహా పారాయణంలో 10–13 సంవత్సరాల విభాగంలో పాల్గొని బంగారు పతకాన్ని ప్రణవి సాధించింది. విశ్రాంత ఉపాధ్యాయులు, దివంగత మల్లిశెట్టి సుబ్బారావు కుమారుడు మల్లిశెట్టి కుమార్ వ్యాస్, శిరీష దంపతులు అమెరికాలోని న్యూజెర్సీలో స్థిరపడ్డారు. వీరి కుమార్తె వేదప్రణవి, గణపతి సచ్చిదానంద స్వామి నుంచి అవార్డు అందుకున్నట్లు వ్యాస్ తెలిపారు. గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో పేరునమోదు చేసుకున్న కొలకలూరు నుంచి మొదటి చిన్నారి కావడం విశేషం. వేద ప్రణవిని గ్రామంలోని పలువురు అభినందించారు. అభినందించిన వారిలో గ్రామ మాజీ సర్పంచులు ఉన్నం ఫకీల, వల్లూరు వరప్రసాద్, ఐటీసీ డీలర్ యడ్లపల్లి రవికిరణ్, తోట నాగేశ్వరరావు, బండి శ్రీనివాస్, పొన్నెకంటి సాంబశివరావు, మంచికలపూడి వెంకటేశ్వరరావు, తాడిబోయిన శ్రీనివాసరావు ఉన్నారు.

విశాఖ ఉక్కు పరిశ్రమను కాపాడుకోవాలి



ఆందోళన నిర్వహిస్తున్న ఆయా పార్టీల నేతలు

మంగళగిరి: విశాఖ ఉక్కు పరిరక్షణ కోసం ఉద్యమాలు ఉధృతం చేస్తామని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు తెలిపారు. బుధవారం సీపీఐ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను విరమించుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కుట్ర వల్ల పరిశ్రమ నష్టాల్లో ఉందని, వంద శాతం ఉత్పత్తి సామర్థ్యంతో నడపాలని డిమాండ్ చేశారు. అంతకుముందు వివిధ పార్టీల ఆధ్వర్యంలో ఉక్కు పరిశ్రమ విక్రయాన్ని ఆపివేయాలంటూ పార్టీ కార్యాలయం వద్ద నుంచి ర్యాలీ నిర్వహించి ఆందోళన చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు చిన్ని తిరుపతయ్య, మేడా హనుమంతరావు, జాలాది జాన్‌బాబు, యార్లగడ్డ వెంకటేశ్వరరావు, పిల్లలమర్రి బాలకృష్ణ, చెంగయ్య పాల్గొన్నారు.

వామపక్షాల ధర్నా

తాడేపల్లిరూరల్ : విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ కార్మిక సంఘాల పిలుపు మేరకు బుధవారం తాడేపల్లి తహసీల్దార్ కార్యాలయం వద్ద వామపక్షాల ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. కార్మిక సంఘ నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు ప్రభుత్వ ఆస్తులను అప్పగిస్తోందని విమర్శించారు. నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటుతున్నాయని, పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్ ధరలు పెరుగుతున్నాయని మండిపడ్డారు. రాస్తారోకోలో సీపీఎం నాయకులు దొంతిరెడ్డి శ్రీనివాసకుమారి, కొట్టే కరుణాకరరావు, గాదె సుబ్బారెడ్డి, సోలా ముత్యాలరావు, యనమాల బర్నబాస్, కట్టా మేరీ, తులసమ్మ, వేముల వెంకన్న, సీపీఐ నాయకులు మునునూరు సుహాస్, తుడిమెల్ల వెంకటయ్య, మునగాల రామారావు, ఐఎఫ్‌టీయూ నాయకులు ఎం.చెన్నయ్య, ఏఐఎఫ్‌టీ నాయకులు కె.ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

మొరాయించిన విద్యుత్ మోటార్లు



వడ్డేశ్వరం దిబ్బల ప్రాంతంలో ట్యాంకర్ల ద్వారా తాగునీటిని సరఫరాచేస్తున్న దృశ్యం

తాడేపల్లిరూరల్ : ఎంటీఎంసీ పరిధిలోని వడ్డేశ్వరంలో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాల వల్ల విద్యుత్ సరఫరాలో హెచ్చుతగ్గులు రావడంతో తాగునీటిని సరఫరా చేసే మోటార్లు మొరాయించాయి. దీంతో బుధవారం ఉదయం నుంచి వడ్డేశ్వరంలోని దిబ్బల ప్రాంతం, చెరువు ప్రాంతం, ఎస్సీ కాలనీల్లో ఎంటీఎంసీ ట్యాంకర్ల ద్వారా తాగునీటిని సరఫరా చేస్తున్నట్లు వడ్డేశ్వరం సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్ సతీష్ తెలిపారు. పాడైపోయిన విద్యుత్ మోటార్లకు మరమ్మతులు చేస్తున్నామని, గురువారం సాయంత్రానికి పనులు పూర్తవుతాయని వివరించారు. గురువారం ఉదయం కూడా ట్యాంకర్ల ద్వారా మంచినీరు సరఫరా చేస్తామని వెల్లడించారు.

సత్తెమ్మతల్లి ఆలయ శంకుస్థాపన



సత్తెమ్మతల్లి ఆలయ శంకుస్థాపనలో పాల్గొన్న సేవా సంఘ సభ్యులు

మంగళగిరి: నగర పరిధిలోని రామచంద్రాపురంలో బుధవారం సత్తెమ్మ తల్లి ఆలయ శంకుస్థాపన నిర్వహించారు. ఆలయానికి 10 సెంట్ల స్థలాన్ని దాత చిడిపూడి చంద్రశేఖరరెడ్డి ఇచ్చారు. శంకుస్థాపన కార్యక్రమంలో ఆలయ సేవా సంఘం ప్రతినిధులు పాల్గొని పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో సేవా సంఘం ప్రతినిధులు చిడిపూడి విజయ్‌భాస్కర్‌రెడ్డి, వీరారెడ్డి, వెంకటరెడ్డి, సుబ్బారెడ్డి, సాంబిరెడ్డితోపాటు పలువురు కుటుంబ సభ్యులతో సహా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఇళ్ల నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి

దావులూరు(కొల్లిపర): పేదల ఇళ్ల నిర్మాణాలపై మండల, గ్రామస్థాయి అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని మండల ప్రత్యేక అధికారి ఆర్.జె.కృష్ణారావు ఆదేశించారు. ఆయన బుధవారం దావులూరులోని జగనన్న హౌసింగ్ కాలనీల్లో ఇళ్ల నిర్మాణ పురోగతిని ఎంపీడీవో పి.శ్రీనివాసులు, తహసీల్దార్ జి.నాంచారయ్యతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం ఇస్తున్న నగదుతో పాటు పొదుపు సంఘాల ద్వారా అందిస్తున్న రుణం, కాలనీలో ప్రభుత్వం కల్పిస్తున్న మౌలిక వసతులు గురించి లబ్ధిదారులకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. బిలో బేస్‌మెంట్ స్థాయిలో ఇళ్ల నిర్మాణాలపై ఎంపీడీవో, హౌసింగ్ ఏఈ సమీక్షలు నిర్వహించారు. బేస్‌మెంట్ స్థాయికి తెచ్చేందుకు కృషి చేయాలని తెలిపారు.

తడిసిన పంటలను ప్రభుత్వం కొనుగోలు చేయాలి

కొల్లిపర: అకాల వర్షాలకు కల్లాల్లో తడిసిన జొన్న, మొక్కజొన్న , పసుపు పంటల్ని మద్దతు ధరకు ప్రభుత్వమే కొనుగోలు చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ములకా శివసాంబిరెడ్డి కోరారు. పలు గ్రామాల్లో బుధవారం ఆయన రైతు నాయకుడు వంగా శివశంకరరెడ్డితో కలసి మొక్కజొన్న పంటను పరిశీలించారు.

రూ.48 లక్షలతో కల్వర్టు నిర్మాణం



కల్వర్ట్ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎంటీఎంసీ డీఈ కృష్ణారెడ్డి తదితరులు

తాడేపల్లిరూరల్ : తాడేపల్లి పట్టణ పరిధిలోని భరతమాత సెంటర్ వద్ద రూ.48 లక్షలతో కల్వర్టు నిర్మాణాన్ని ఎంటీఎంసీ సాధారణ నిధులతో చేపట్టారు. ఈ పనులను ఎంటీఎంసీ డీఈ కృష్ణారెడ్డి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాడేపల్లి పట్టణ పరిధిలోని మణిపాల్ హాస్పిటల్, క్రిస్టియన్ పేట, నవోదయ కాలనీ, ఎన్టీఆర్ కరకట్ట దిగువ ప్రాంతం, నీలిమా నర్సరీ ప్రాంతాల్లో దాదాపుగా 1,200 నివాసాలు ఉన్నాయని, గతంలో భరతమాత సెంటర్ వద్ద ఉన్న పైపులైను పూడుకుపోవడంతో మురుగునీరు బయటకు వెళ్లక ఈ ప్రాంత ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. దీంతో రూ.48 లక్షలతో కల్వర్ట్ నిర్మాణ పనులు చేపట్టామని, వారంలో పూర్తవుతాయని వివరించారు. ఈ కల్వర్ట్ నిర్మాణం వల్ల శాశ్వతంగా మురుగునీటి సమస్య పరిష్కారమవుతుందని పేర్కొన్నారు.

ఆస్పత్రికి వెళ్లి కొత్త పెన్షన్ అందజేత



నల్లబ్బాయికి పెన్షన్ అందజేస్తున్న రేవేంద్రపాడు సర్పంచ్ పలుకూరు మేరమ్మ తదితరులు

తాడేపల్లిరూరల్ : దుగ్గిరాల మండలం రేవేంద్రపాడులో కొత్తగా వచ్చిన పెన్షన్‌ను 1వ తేదీన లబ్ధిదారులదరికీ అందజేశారు. రేవేంద్రపాడులో నివాసం ఉండే నల్లబోతుల నల్లబ్బాయి అనారోగ్యం పాలవడంతో మంగళగిరి ఎన్‌ఆర్‌ఐ ఆస్పత్రిలో చేరాడు. సర్పంచ్ పలుకూరు మేరమ్మ బుధవారం మంగళగిరిలోని ఎన్‌ఆర్‌ఐ ఆస్పత్రికి వెళ్లి నల్లబోతుల నల్లబ్బాయికి పెన్షన్‌ను అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ రేవేంద్రపాడులో 11 మందికి కొత్తగా పెన్షన్లు అందజేశామని వివరించారు. కార్యక్రమంలో గ్రామ సెక్రటరీ మొగలి శరత్, వెల్ఫేర్ అసిస్టెంట్ మొబీనా, వైఎస్సార్‌సీపీ నాయకులు పలుకూరి శామ్యూల్ పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ కార్యకర్త కుటుంబానికి రూ.20వేల సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న శృంగారపాటి సందీప్, నాయకులు

బోరుపాలెం(తాడికొండ): తుళ్ళూరు మండలం బోరుపాలెం గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ మండల మాజీ అధ్యక్షుడు తురకా శ్రీనివాసరావు కుటుంబానికి ఎస్సీ సెల్ నాయకులు శృంగారపాటి సందీప్ ఆర్థిక సాయం అందజేశారు. ఇటీవల గుండెపోటుతో శ్రీనివాసరావు మరణించడంతో ఆయన కుటుంబ సభ్యులు పెద్ద దిక్కును కోల్పోయి దిగ్భ్రాంతికి లోనయ్యారు. బుధవారం పలువురు మండల స్థాయి నాయకులతో కలిసి శ్రీనివాసరావు కుటుంబాన్ని పరామర్శించిన సందీప్ రూ.20 వేలు ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ ఎస్సీసెల్ తుళ్ళూరు మండల వర్కింగ్ ప్రెసిడెంట్ బుర్రా వెంకట శివారెడ్డి, పార్టీ తుళ్ళూరు గ్రామ అధ్యక్షుడు ఆలోకం సురేష్, నాయకులు రమణారెడ్డి, చలివేంద్రం సురేష్, నేలపాటి నాగేంద్ర, రాఘవులు పాల్గొన్నారు.

బావి దిమ్మె పగలగొట్టిన దుండగులు



పగలగొట్టిన బావి దిమ్మె

ఫిరంగిపురం: వినియోగంలో లేని బావికి మరమ్మతులు చేసి గిలకలు ఏర్పాటు చేసేందుకు నిర్మించిన దిమ్మెలను గుర్తుతెలియని వ్యక్తులు పగలగొట్టిన ఘటన మండలంలోని యర్రగుంట్లపాడు గ్రామంలో మంగళవారం రాత్రి జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. మండలంలోని యర్రగుంట్లపాడు ఎస్సీ కాలనీలోని చెరువుకట్ట వద్ద ఇటీవల గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించిన వైఎస్సార్ సీపీ సమన్వయకర్త కత్తెర సురేష్‌కుమార్ దృష్టికి బావి మరమ్మతులకు గురైన విషయాన్ని స్థానికులు తీసుకెళ్లారు. దీంతో ఆయన బావి మరమ్మతులకు సొంత నిధులు కేటాయించారు. కొద్దిరోజులుగా పనులు జరుగుతుండగా బావి గట్టుపై గిలకల ఏర్పాటుకు నిర్మించిన దిమ్మెలను గుర్తుతెలియని వ్యక్తులు మంగళవారం రాత్రి పగలగొట్టారు. దీంతో స్థానికులు పోలీసు స్టేషన్‌లో బుధవారం ఫిర్యాదు చేశారు.

ఆర్కే చొరవతో దశాబ్దాల సమస్యకు పరిష్కారం

పెదవడ్లపూడి హెడ్ స్లూయిస్ గేటు రేడియం షట్టర్ నిర్మాణానికి రూ.పది లక్షలు కేటాయించిన ఎంపీ అయోధ్యరామిరెడ్డి



పెదవడ్లపూడి శిథిలావస్థకు చేరిన పెదవడ్లపూడి స్లూయిస్ షట్టర్

పెదవడ్లపూడి(మంగళగిరి): ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) చొరవ, రాజ్యసభ సభ్యులు ఆళ్ల అయోధ్యరామిరెడ్డి నిధుల కేటాయింపుతో ఐదు మండలాల రైతుల దశాబ్దాల సమస్య పరిష్కారం కానుంది. దీంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఐదు మండలాల్లోని 32 వేల ఎకరాలకు పెదవడ్లపూడి హెడ్ స్లూయిస్ గేట్లకు ఉన్న రేడియం షట్టర్ల ద్వారా సాగునీరు సరఫరా అవుతుంది. అయితే దశాబ్దాల క్రితం రెండు రేడియం షట్టర్లలో ఒకటి పూర్తిగా శిథిలావస్థకు చేరింది. దీంతో సాగునీరు వృథాగా పోతోంది. ఈ విషయాన్ని ఎమ్మెల్యే ఆర్కే దృష్టికి తీసుకెళ్లడంతో కొత్త షట్టర్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. నీటి పారుదల శాఖ అధికారులు తమ శాఖలో నిధుల కొరత ఉందని చెప్పడంతో ఎమ్మెల్యే ఆర్కే విషయాన్ని రాజ్యసభ సభ్యులు ఆళ్ల అయోధ్య రామిరెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన అయోధ్యరామిరెడ్డి షట్టర్ ఏర్పాటుకు ఎంత ఖర్చు అవుతుందో ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. రూ.10 లక్షలతో అధికారులు అంచనాలు సిద్ధం చేశారు. దీంతో ఎంపీ అయోధ్య రామిరెడ్డి తన గ్రాంటు నుంచి నిధులు మంజూరు చేశారు. వెంటనే అధికారులు షట్టర్ ఏర్పాటు ప్రక్రియను ప్రారంభించారు. త్వరలో పనులు పూర్తిచేసి సాగునీటి సరఫరాకు అధికారులు చర్యలు తీసుకోనున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన యువకుడు మరియబాబు

తాడేపల్లిరూరల్ : జాతీయ రహదారిపై కుంచనపల్లి బకింగ్‌హామ్ కెనాల్ బ్రిడ్జిపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. ఎస్‌ఐ రమేష్ కథనం ప్రకారం ప్రకాశం జిల్లా దొనబండ మండలం పెదపూడి గ్రామానికి చెందిన గన్నేపల్లి మరియబాబు (36) విజయవాడ నుంచి గుంటూరు వైపు జాతీయ రహదారిపై ద్విచక్రవాహనంపై ప్రయాణిస్తుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. దీంతో యువకుడు తలకు గాయమై మృతి చెందాడు. ద్విచక్రవాహనం, ఆధార్ కార్డు ఆధారంగా పెదపూడిలోని మరియబాబు బంధువులకు సమాచారం అందజేశామని, పోస్ట్‌మార్టం నిమిత్తం మృతదేహాన్ని మంగళగిరి ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.